క్లుప్తంగా

పార్టీని బలోపేతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న పాండురంగారెడ్డి

తుక్కుగూడ: మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, తుక్కుగూడ మున్సిపాలిటీ ఎన్నికల సమన్వయ కర్త కప్పాటి పాండురంగారెడ్డి అన్నారు. మంగళవారం పుర కేంద్రంలో పార్టీ క్రియాశీలక సభ్యులు, నాయకులుతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేఎల్లార్ ఆదేశాల మేరకు వార్డు కమిటీలు వేస్తున్నామని తెలిపారు. ఇందులో యువత, మహిళలకు పెద్దపీట వేస్తున్నామని స్పష్టంచేశారు. పార్టీలో మొదటి నుంచి కష్టపడిన కార్యకర్తలకు సముచిత న్యాయం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ నాయకులు గోగికర్ జానకీరామ్, బి.వెంకట్‌రెడ్డి, పాండురంగారెడ్డి, యాదయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎల్లమ్మతల్లికి ప్రత్యేక పూజలు


ఆలయంలో దర్శనం కోసం ఉన్న భక్తులు

తుక్కుగూడ: మున్సిపల్ పరిధిలోని సూర్యగిరి ఎల్లమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో దర్శనం కోసం భక్తులు బారులుతీరారు. అనంతరం బోనం సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాగణంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డి గణ్ల రత్నం, ఈఓ మోహన్‌రావు, సిబ్బంది మీగడ కాశీనాథ్, పూజారులు పాల్గొన్నారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

మున్సిపల్ కార్యాలయం ఎదుట బీజేపీ ధర్నా


ధర్నా చేస్తున్న నాయకులు

బడంగ్‌పేట్: అధికారుల నిర్లక్ష్యం మూలంగా పబ్లిక్ ప్రాపర్టీలు భూ మాఫియా చేతుల్లోకి వెళ్తున్నాయని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు ధర్నాకు దిగారు. అధికారులకు ఎన్నిమార్లు విన్నవించినా కమీషన్ల కోసం అక్రమార్కుల పక్షానే అధికారులు నిలబడటం సరికాదన్నారు. అనంతరం అధికారుల నిర్లక్ష్యాన్ని ఎంగడుతూ బడంగ్‌పేట ప్రధాన రహదారిపై అర్ధనగ్నంతో ధర్నాకు దిగారు. పోలీసులు చేరుకొని ట్రాఫిక్ స్తంభించకుండా చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ కార్పొరేషన్ 1, 2 అధ్యక్షులు రాళ్లగూడం రామకృష్ణారెడ్డి, రామిడి వీరకర్ణారెడ్డి, కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు గడ్డం లక్ష్మారెడ్డి, దడిగ శంకర్, నాయకులు ఉన్నారు.

భూదాన్ భూములను కాపాడండి

సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూదాన్ భూములను కబ్జాదారుల నుంచి కాపాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో సీపీఐ మండల 6వ మహాసభలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై సీపీఐ జెండాను ఎగురవేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ, భూదాన్ భూములతో పాటు ఇతర మిగులు భూములలో అసైన్డ్ భూములు వేలాది ఎకరాలు ఉన్నాయని, ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవడంతో కబ్జాదారులు యథేచ్ఛగా ఆక్రమించుకొని కోట్ల రూపాయలు దండుకుంటున్నారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రజా పోరాటాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. సీపీఐ పార్టీ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పార్టీ చరిత్ర ప్రజలకు తెలియజెప్పే విధంగా జిల్లా, మండలం, పట్టణ కేంద్రాలతో పాటుగా గ్రామాల్లో ఉత్సవాలను నిర్వహించాలని సూచించారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా లింగంనాయక్, సహాయ కార్యదర్శులుగా పవన్‌చౌహాన్, రమేశ్‌తో పాటుగా 9 మంది కార్యవర్గ సభ్యులు, 21 మంది కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు, జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీను, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతన్న బిజీబిజీ

- ముమ్మరంగా వ్యవసాయ పనులు
- అడపాదడపా కురిసిన వర్షాలతో పొద్దంతా చేలలోనే అన్నదాతలు
- 20వేల పైచిలుకు ఎకరాల్లో పంటల సాగు


పులిమామిడిలో వరిసాగుకు ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న రైతు

కందుకూరు: మండలంలో వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. గ్రామాల్లో సాగు సందడి మొదలైంది. వానాకాలం వ్యవసాయ సాగులో రైతులు, కూలీలు బిజీ అయ్యారు. విత్తనాలు విత్తుకోవడం, కలుపు మొక్కలను తొలగించడం, పురుగు మందులు పిచికారీ చేయడం, ఎరువులు చల్లడం వంటి పనులతో పంట చేలలో సందడి కనిపిస్తోంది. గత నెలవరకు అనుకున్నట్లుగా వర్షాలు కురవకపోవడంతో అన్నదాతలు ఆందోళనకు గురయ్యారు. కానీ..కొద్దిరోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలు కర్షకుల్లో ఆశలను చిగురింపజేశాయి. రైతులు పత్తి, మొక్కజొన్న, జొన్న, వరి వంటి ప్రధాన పంటల సాగు ఇప్పటికే చేపట్టారు. ఇంకా వర్షాలు సంమృద్ధిగా కురిస్తే పంటల సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది.

20,676 ఎకరాల్లో పంటల సాగు..

మండల పరిధిలో వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. మండలంలో సాగు విస్తీర్ణం 20,676 ఎకరాలుగా ఉంది. కాగా అందులో వరి సాధారణ విస్తీర్ణం 8,119 ఎకరాలకు గాను ఇప్పటివరకు 7 వేల ఎకరాల వరకు సాగు చేయడానికి రైతులు నారుమడులు సిద్ధం చేసుకున్నారు. 65 ఎకరాల వరకు నాట్లు వేసుకున్నారు. మొక్కజొన్న సాధారణ విస్తీర్ణం 3,493 ఎకరాలకు గాను ఇప్పటివరకు 3, 200 ఎకరాల్లో సాగు చేపట్టారు. రానున్న రోజుల్లో విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. జొన్న 951 ఎకరాలకు గాను 400 ఎకరాల్లో సాగైంది. కంది సాధారణ విస్తీర్ణం 1,426 ఎకరాలు కాగా ఇప్పటివరకు 50 ఎకరాల్లో సాగు చేశారు. వర్షాలు ఈ నెలలో బాగా కురిస్తే పంటల సాగు విస్తీర్ణం మరింత పెరుగుతుందని ఏఓ లావణ్య పేర్కొన్నారు.

పనుల్లో నిమగ్నం..

మండలంలో రైతులు సాగు పనుల్లో బిజీ అయ్యారు. వరి నాట్లు వేయడానికి పొలాన్ని ట్రాక్టర్లతో దమ్ము చేయించడం, సాగు చేసిన పంటల్లో కలుపు మొక్కలు తీయడం, ఇతర పంటలను విత్తుకోవడం, ఎరువులు వేసుకోవడం వంటి పనుల్లో నిమగ్నమయ్యారు.


కొత్తగూడలో విత్తనాలు నాటుతున్న కూలీలు


పులిమామిడిలో పత్తిలో కలుపు తీస్తున్న కూలీలు


జైత్వారంలో వరినాట్లకు సిద్ధం చేసుకున్న పొలం, అందులో నారుమడి

జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

టీయూడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యదర్శి సైదులు


మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి సైదులు

మహేశ్వరం: జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా టీయూడబ్ల్యూజేఎఫ్ నిరంతరం పని చేస్తుందనిజిల్లా కార్యదర్శి సైదులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రఘుపతి కాంప్లెక్స్‌లో నియోజకవర్గ స్థాయి జర్నలిస్టులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధిలా పని చేస్తున్న అనేక మంది జర్నలిస్టులు పేదరికంలో మగ్గుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి, బీమా సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. అర్హత కలిగిన జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. అంతకు ముందు మహేశ్వరం నియోజకవర్గ టీయూడబ్ల్యూజేఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తడక నర్సింహ, కార్యదర్శిగా కొర్వి సురేందర్, ఉపాధ్యాక్షులుగా రాందాస్, ప్రభాకర్, శ్రీనివాస్‌రావు, సహాయ కార్యదర్శులుగా పి.వెంకటేశ్, ఎం.ప్రశాంత్, కోశాధికారిగా రాజు, ప్రచార కార్యదర్శిగా రాజేశ్వరీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజేఎఫ్ నాయకులు గణేష్, సురేష్, శ్రీరాములు, శేఖర్, అంజనేయులు, చండీశ్వర్ పలువురు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి దోహదం


మహిళా శక్తి సంబురాల్లో పాల్గొన్న అధికారులు, మహిళా సంఘాలు

కందుకూరు: మహిళలు ఆర్థిక శక్తిగా ఎదగడానికి మహిళా సంఘాలు దోహదం చేస్తాయని, గ్రామాల్లో ప్రతి మహిళను సంఘంలో చేర్పించాలని డీఆర్‌డీఏ ఏపీడీ జాజప్ప, ఏపీఎం కవిత కోరారు. మంగళవారం మండల సమాఖ్య అధ్యక్షురాలు సీహెచ్ ధనలక్ష్మి ఆధ్వర్యంలో మహిళా సమాఖ్య కార్యాలయంలో ఇందిరా మహిళా శక్తి సంబురాల కార్యక్రమాన్ని నిర్వహించారు. సమాఖ్య ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్యాంటీన్లు, పెట్రోల్ పంపులు, సోలార్ ప్లాంట్లు, అద్దె ఆర్టీసీ బస్సులు, మిల్క్ సెంటర్లు తదితరాలు ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. మహిళలందరూ సంఘాల్లో చేరి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీసీలు ఎస్.మైసయ్య, జె.గణేష్, మాధవి, రాజు, ఎంఎస్ సీసీలు శ్రీలత, హైమావతి, ప్రభాకర్, శ్రీహరి, ధనలక్ష్మీ, సిబ్బంది రాజేశ్వరి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ అనితారెడ్డి


మాట్లాడుతున్న జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

కందుకూరు: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్, పార్టీ అబ్జర్వర్ తీగల అనితహరినాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు మండలాన్ని 8 క్లస్టర్లుగా విభజించామన్నారు. క్లస్టర్ ఇన్‌చార్జిలు వారి పరిధిలోని గ్రామాలకు సంబంధించి పార్టీ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. పార్టీ బలోపేతానికి అందరూ సైనికుల్లా పనిచేయాలన్నారు. స్థానిక ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో పార్టీ జెండా ఎగురవేసేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సీహెచ్ యాదయ్య, నేనావత్ రాజునాయక్, కాకి ఈశ్వర్, నందిగామ నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ


విద్యార్థులతో ట్రస్ట్ సభ్యులు, ఉపాధ్యాయులు

కందుకూరు: ఉల్లాస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 2025–26 విద్యా సంవత్సరంలోని 9, 10 తరగతుల్లో ఎంపికైన విద్యార్థులకు మంగళవారం ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. అన్ని పాఠశాలల నుంచి ఒక్కో తరగతికి 20 మంది చొప్పున రెండు తరగతులకు కలిపి మొత్తం 40 మందికి ఉపకార వేతనాలను హెచ్‌ఎం అంజయ్య చేతుల మీదుగా అందజేశారు. నేదునూరు, గూడూరు, కందుకూరు బాలురు, కందుకూరు బాలికల జిల్లా పరిషత్ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉల్లాస్ ట్రస్ట్ వలంటీర్లు శిరీష, చంద్రభూషణ్ మాట్లాడుతూ.. విద్యార్థుల ఉన్నత చదువుకు ప్రోత్సాహంగా ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎండీ అయూబ్, డాక్టర్ ఎండీ బషీర్, మల్లికార్జునరావు, మంజులతారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

ఇన్‌చార్జి ఎంపీడీఓ కిష్టయ్య


మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ కిష్టయ్య

కేశంపేట: మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఇన్‌చార్జి ఎంపీడీఓ కిష్టయ్య అన్నారు. మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య భవనంలో మంగళవారం ఇందిరా మహిళా శక్తి సంబురాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం మహిళలు అన్ని రంగాల్లో రాణించాలనే లక్ష్యంతో స్కూల్ యూనిఫామ్స్ కుట్టు కేంద్రాలు, పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములను చేయాలనే అమ్మ ఆదర్శ కమిటీలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అదేవిధంగా పౌల్ట్రీ, డెయిరీ, పాడిపరిశ్రమ, ఎంటర్‌ప్రైజెస్, సోలార్ యూనిట్ల ఏర్పాటుకు లోన్‌లను అందిస్తుందన్నారు. ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకుల ఏర్పాటుకు ప్రభుత్వం సాయం అందిస్తుందని వెల్లడించారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఆయన అకాంక్షించారు. బుధవారం గ్రామాల్లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి సంబురాలను నిర్వహించాలని కోరారు. ఈ నెల 18వరకు మహిళలకు వడ్డీలేని రుణాల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం భగవంతు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్యలక్ష్మీ, కార్యదర్శి సుగుణమ్మ, కోశాధికారి గీత, సీసీలు రాంచంద్రయ్య, మల్లేశ్, యాదయ్య, నర్సింహా, సిబ్బంది కవిత, వివిధ గ్రామాల సమాఖ్య అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పరిహారం తేల్చాకే భూములు తీసుకోవాలి

సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్


రైతులతో మాట్లాడుతున్న దేవేందర్

మొయినాబాద్: గోశాల ఏర్పాటుతో భూములు కోల్పోతున్న ఎనికేపల్లి రైతులకు పరిహారం తేల్చాకే ప్రభుత్వం భూములను తీసుకోవాలని సీపీఎం పార్టీ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీలోని ఎనికేపల్లి భూముల వద్ద రైతులతో మాట్లాడి వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి నష్ట పరిహారం ఇవ్వకుండా గోశాల పనులకు భూమిపూజ చేయడం సరైన పద్ధతి కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు తెచ్చిన 2013 భూ సేకరణ చట్టం ప్రకారం రైతులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. లేదంటే రైతులు కోరిన విధంగా పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దశాబ్దాల కాలంగా భూముల్లో సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్న పేదలకు అన్యాయం చేయాలని చూస్తే చూస్తూ ఊరుకోమన్నారు. వెంటనే పరిహారం విషయాన్ని తేల్చి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం


మహేశ్వరం: మండల కేంద్రంలో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

మహేశ్వరం: దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి పేదల అభ్యున్నతి కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాకలి యాదయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి 76వ జయంతి సందర్భంగా అంబేడ్కర్ చౌరస్తాలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడుగు, బలహీనవర్గాల అభివృద్ధికి ఆయన నిరంతరం కృషి చేశారన్నారు. పేదలను దృష్టిలో పెట్టుకొని ఆరోగ్యశ్రీ, 108, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, రాజీవ్ గృహకల్ప ఇళ్ల నిర్మాణం, ఫీజు రీయింబర్స్‌మెంట్, రేషన్‌కార్డుతో, పేదలకు భూ పంపిణీ పలు ప్రజాకర్షణ పథకాలను రూపొందించి అమలు చేశారన్నారు. ఆయన సేవలు ఎప్పటికీ మరువలేమన్నారు. అంతకుముందు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ నందిగామ నర్సింహ, మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు కాకి ఈశ్వర్, ఆవుల యాదయ్య, శివగంగ రాజరాజేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ అల్లె కుమార్, మండల ఎస్టీ సెల్ మాజీ అధ్యక్షుడు నేనావత్ రాజునాయక్, పట్టణ శాఖ అధ్యక్షుడు బంగరిగళ్ల లాజర్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, పాండునాయక్, నర్సింహగౌడ్, రవినాయక్ పలువురు పాల్గొన్నారు.

మంఖాల్‌లో..

తుక్కుగూడ: దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతిని మున్సిపల్ పరిధిలోని మంఖాల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన రాష్ట్రానికి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ యాదయ్య, నాయకులు భాస్కర్‌రెడ్డి, సుందరయ్య, రాజు, సల్మాన్, మహేశ్, సురేష్, బాబు, సురేందర్‌రెడ్డి, గిరి తదితరులు పాల్గొన్నారు.

కందుకూరులో..

కందుకూరు: దివంగత మాజీ సీఎం వైఎస్సార్ జయంతిని పురస్కరించుకొని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సొడవు వెంకటేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో కందుకూరు చౌరస్తాలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ జి.శమంతప్రభాకర్ రెడ్డి, కాంగ్రెస్ మండల కోఆర్డినేటర్ ఎండీ అఫ్జల్ బేగ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎస్.పాండు, బీసీ సెల్ అధ్యక్షుడు ఎస్.జగన్, మాజీ వార్డు సభ్యులు గుండ్ర సుధాకర్‌రెడ్డి, ఎస్.రాంరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బి.ప్రశాంత్, పుష్పదర్శన్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

మహానేతకు ఘన నివాళి

బడంగ్‌పేట: కార్పొరేషన్ పరిధిలో మంగళవారం వైఎస్సార్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహానేత విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. అనేక సంక్షేమ పథకాలతో ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నేత రాజశేఖరరెడ్డి అని కొనియాడారు.


మీర్‌పేట: మందమల్లమ్మ చౌరస్తాలో..

మీర్‌పేటలో..

మీర్‌పేట: దివంగత మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతిని మంగళవారం మీర్‌పేట మందమల్లమ్మ చౌరస్తాలో టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు సామిడి గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు సోమ భూపాల్‌రెడ్డి, చరణ్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, అరుణ, భవనం పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బడంగ్‌పేట: అల్మాస్‌గూడలో..


తుక్కుగూడ: మంఖాల్‌లో..


కందుకూరులో..

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

మొయినాబాద్‌రూరల్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని యోగా స్పిరిట్యూవల్ సైన్స్ మాస్టర్, రిటైర్డ్ ఉద్యోగి జంగారెడ్డి అన్నారు. మంగళవారం హిమాయత్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు యోగాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఆంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ నిత్యం యోగా(మెడిటేషన్) సాధన చేసి సంపూర్ణ ఆరోగ్యం పొందాలని సూచించారు. ఆరోగ్యానికి, మానసిక ప్రశాంతతకు, జీవన శైలిలో సమతుల్యతకు యోగా ఎంతో దోహదపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని, దినచర్యలో భాగంగా యోగాను భాగం చేసుకోవాలన్నారు. విద్యార్థి దశ నుంచే మంచి ఆలోచనలతో ముందుకెళ్లాలని ఉన్నత రంగాల్లో స్థిరపడాలని సూచించారు. అనంతరం విద్యార్థులందరికీ ఆయన యోగా పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాములు, శైలజ, భాగ్యలక్ష్మీ, సుమిత్ర, మమత, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని వినతి


డీఈకి వినతిపత్రం అందిస్తున్న మాజీ సర్పంచ్ నవీన్‌కుమార్, రైతులు

కేశంపేట: మండల పరిధిలోని కొత్తపేటలో విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని గ్రామ మాజీ సర్పంచ్ కమ్లేకర్ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురు రైతన్నలు షాద్‌నగర్‌లో డీఈ శ్యాంసుందర్‌రెడ్డికి మంగళవారం వినతిపత్రం అందించారు. గ్రామంలో గత కొన్ని నెలలుగా రైతులు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాల కోసం డీడీలను తీసినట్టు వారు డీఈ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే వ్యవసాయ, గృహ అవసరాలకు డీడీల నగదును సిబ్బంది అధికంగా వసూలు చేస్తున్నారని తెలిపారు. రైతులు చెల్లించిన డీడీలకు అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌లతో పాటుగా విద్యుత్ స్తంభాలను, వైర్లను అందించాలని ఆయన కోరారు. మండలంలో విద్యుత్ సిబ్బంది కొరత అధికంగా ఉందని, సిబ్బందిని నియమించి రైతులు, ప్రజలకు విద్యుత్ సేవల్లో ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలపై డీఈకి 21 పేజీల లేఖను అందించారు. దీనిపై స్పందించిన డీఈ పది రోజుల్లోగా సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మల్లేశ్‌యాదవ్, జగన్‌రెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు టీడబ్ల్యూజేఎఫ్ మద్దతు

షాద్‌నగర్: దేశవ్యాప్తంగా బుధవారం నిర్వహించే సమ్మెకు టీడబ్ల్యూజేఎఫ్ పూర్తి మద్దతు ఇస్తుందని నియోజకవర్గ అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్కింగ్ జర్నలిస్టుల చట్టం, వేతన సవరణ చట్టంతో పాటుగా 44 చట్టాలను రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన సమ్మె పిలుపుకు, ఆందోళన కార్యక్రమాలకు టీడబ్ల్యూజేఎఫ్ సంఘీభావం ప్రకటిస్తుందని పేర్కొన్నారు. సమ్మెలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు.